సాక్షి శ్రీకాకుళం

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



ఉద్దానం పెద్దబిడ్డ

నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం. జిల్లాలో 32565 ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది.

- IIలో



వెయిట్‌లిఫ్టింగ్ పోరుకు సిద్ధం

శ్రీకాకుళంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి. ఆదివారం నుంచి పోటీలు మొదలవుతాయి.

- IIలో

నేడు డయల్ యువర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రతి నెలలో మొదటి శనివారం నిర్వహించే డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ సి.హెచ్.ఎ. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వర్సిటీలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య విద్యార్థులు 8247861919 నంబర్‌కు కాల్ చేసి సమస్యలు చెప్పాలని సూచించారు.

న్యూస్‌రీల్

జెడ్పీలో ట్రైనీ కలెక్టర్ పర్యటన



జెడ్పీలో ట్రైనీ కలెక్టర్‌తో చర్చిస్తున్న సీఈఓ వెంకట్రామన్, డీపీఓ రవికుమార్

అరసవల్లి: పంచాయతీ రాజ్ చట్టం, అమలు, విధి విధానాలపై అవగాహనకు ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్‌లు ఆయనకు పంచాయతీరాజ్ వ్యవస్థను వివరించారు. జిల్లాలో పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, వస్తున్న నిధులు ఇతరత్రా వివరాలను వివరించారు.

రూ.కోటి యూనిట్ మంజూరు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కొత్తూరుకి చెందిన కమక భాగ్యవతి, దుర్గాసీ అమరావతిలకు 50శాతం రాయితీపై రూ.కోటి విలువ చేసే మేకల యూనిట్‌ను మంజూరు చేసినట్లు శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పి.సూర్యం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గొర్రెలు, మేకలు పెంపకంపై ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో ఇప్పటికే రూ.26కోట్లను 26 మందికి మంజూరు చేసినట్లు, దీనిలో రూ. 13కోట్లు సబ్సిడీ ద్వారా నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ-శ్రమ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అసంఘటిత కార్మికులందరూ తప్పనిసరిగా ఈ-శ్రమ పోర్టల్, ఈ గవర్నెన్స్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. శ్రీకాకుళం కోర్టు ఆవరణలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కామన్ సర్వీస్ సెంటర్, విలేజ్ లెవెల్ ఎంటర్‌ప్రెన్యూర్‌తో శుక్రవారం సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. సన్యాసినాయుడు మాట్లాడుతూ జిల్లాలో అసంఘటిత కార్మికులందరూ విలేజ్ లెవెల్ ఎంటర్‌ప్రెన్యూర్ల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ జరిగితే వివిధ పథకాల లబ్ధి అందుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రసాదరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆర్వీ శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ మేనేజర్ కామన్ సర్వీస్ సెంటర్ వెంకటేష్, మధుకిరణ్, శ్రీకాకుళం జిల్లాలోని విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్ న్యాయవాది ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆంధ్రాది అగ్రస్థానం



పీహెచ్‌సీలో సదుపాయాల గురించి వైద్యులతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ది అగ్రస్థానమని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం స్పష్టం చేశారు. రెడ్డీస్ ఫౌండేషన్ నిధులతో ఆధునికీకరించిన స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో రెడ్డీస్ ఫౌండేషన్ దాతృత్వం గొప్పదని అభినందించారు. రానున్న కాలంలో రావాడ, జి.సిగడాం, హిరమండలం, కె.కొత్తపల్లి, ఎంఎస్‌పల్లి, బొరివంక పీహెచ్‌సీలను ఆధునికీకరించేందుకు నిర్ణయించడం సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా తొగరాం, దూసి,గుత్తావల్లి పీహెచ్‌సీలను కూడా ఆధునికీకరించేందుకు ముందుకు రావాలని ఫౌండేషన్ ప్రతినిధులకు సూచించారు. వైద్య రంగం అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. గిరిజన, మైదాన, తీర ప్రాంతాలను 3 విభాగాలుగా వర్గీకరించి అక్కడ వ్యాపిస్తున్న వ్యాధుల తీవ్రతను బట్టి ప్రభుత్వం వైద్య సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ సీఈఓ షమిక్ తెహరాన్, జిల్లా ఇన్‌చార్జి సురేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి, మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, స్థానిక వైద్యాధికారులు పాల్గొన్నారు.

గుండె గుడిలో..

- ప్రజల్లో గుండెల్లో కొలువై ఉన్న మహానేత వైఎస్సార్
- జిల్లాలో అడుగడుగునా రాజన్న జ్ఞాపకాలు
- నాటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే జిల్లా ప్రగతికి సోపానాలు
- నేడు వైఎస్సార్ వర్ధంతి



పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే ఆ పంచె కట్టు, మనిషిని తలచుకోగానే మదిలో మెదిలే ఆ చిక్కటి చిరునవ్వు, ఆజన్మాంతం గుర్తుండిపోయే ఆ అరుదైన పలకరింపు ఇంకా జనం గుండెలో సజీవంగా నిలిచి ఉన్నాయి. చేసిన మంచి పనులకు తోడు పాలనలో చూపిన సమర్థత వైఎస్ రాజశేఖర రెడ్డి అనే పేరును చిరస్మరణీయం చేసింది. శ్రీకాకుళం అభివృద్ధికి ఆయన వేసిన పునాది రాళ్లపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ సౌధాలు నిర్మిస్తున్నారు. ఈ నాడు ప్రజలు అందుకుంటున్న సంక్షేమ పథకాలకు స్ఫూర్తి ప్రదాత ఆ మహానాయకుడే.

గుర్తున్నాయా ఆ రోజులు.. పేదలకు గూడునిచ్చి ఆయన జనబాంధవుడయ్యారు. ఆపద్బాంధవుడిగా నిరుపేద రోగుల ప్రాణాలను కాపాడారు. రైతు పక్షపాతిగా ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి చరిత్రలో తన పేరును లిఖించుకున్నారు. ఉన్నంత కాలం ప్రజల మేలు కోరి పనిచేశారు. తన సుదీర్ఘ పాదయాత్రలో గుర్తించిన సమస్యలకు పరిష్కారం చూపడమే కాకుండా ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారు. జిల్లాలో ఆయన జ్ఞాపకాలు అడుగడుగునా కనిపిస్తాయి. నేడు ఆయన వర్ధంతి..

– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

జిల్లాలో రాజన్న జ్ఞాపకాలు



చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకే విశాఖపట్నానికి పరుగులు తీసే శ్రీకాకుళం జిల్లా ప్రజలకు ఓ పరిష్కారం చూపారు. జిల్లా కేంద్రంలో పెద్దాస్పత్రి ఉండాల్సిందేనని భావించి ప్రజలు కోరకుండానే ఒక ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేశారు.. మంజూరు ప్రకటన చేయడమే కాకుండా రూ.119కోట్లు కేటాయించారు. 300 పడకల జిల్లా కేంద్ర ఆస్పత్రిని 500 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశారు. శంకుస్థాపన, ప్రారంభోత్సవం రెండూ ఆయన చేతులు మీదుగానే జరిగాయి. 13 ఆధునిక వసతులతో కూడిన భవనాలను మంజూరు చేసిన ఘనత వైఎస్సార్‌దే.



- ప్రతి జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని వైఎస్సార్ భావించారు. దానిలో భాగంగా జిల్లాకు యూనివర్సిటీని అందించారు. ఎచ్చెర్లలో 2008 జూలై 25న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉన్నత విద్యావేత్తలుగా యూనివర్సిటీ తీర్చిదిద్దుతోంది.



- నదులున్నా పొలాలు తడవని పరిస్థితి, భూము లున్నా సాగు చేసుకోలేని దుస్థితి, సాగు చేద్దామని భావించినా అప్పు పుట్టని రోజులను వైఎస్సార్ చూశారు. అలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకున్న ఏకైక నేత వైఎస్సారే. 2.50లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ చేశారు. అప్పటికే రుణాలు చెల్లించేసిన వారికి రూ.5వేలు చొప్పున ప్రోత్సాహం అందించారు. అంతటితో ఆగకుండా ప్రతి చుక్కనీటిని అందిపుచ్చుకుని, రైతుకు అందించాలని అనేక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. 2005మే నెలలో వంశధార స్టేజ్ 2, ఫేజ్2 ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. 20మండలాల్లో 2.55లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు తలపెట్టారు. జిల్లాలోని హిరమండలం వద్ద సుమారు 10వేల ఎకరాల్లో 19టీఎంసీల నీటి నిల్వకోసం రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. తోటపల్లి ఫేజ్ 2 పనుల ఘనత ఆయనకే దక్కుతుంది.



- పలాస పట్టణానికి తాగు నీటి సమస్య పరిష్కారం కోసం రూ.123.25కోట్లతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. వంశధార, నాగావళి నదుల అనుసంధానం పనులు పూర్తయితే 2.55లక్షల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని వైఎస్సార్ అప్పట్లో పనులకు శ్రీకారం చుట్టారు. 12,500 ఎకరాల సాగునీటి కోసం మడ్డువలస ప్రాజెక్టు స్టేజ్-1 పనులను రూ.57.87కోట్లతో చేపట్టారు. నాగావళి, వంశధార నదుల వరద ఉధృతి నుంచి పంట పొలాలను, ఆవాసాలను రక్షించేందుకు రూ.300 కోట్లతో కరకట్టల నిర్మాణాలకు సంకల్పించారు. సీతంపేట ఏజెన్సీలో 14వేల ఎకరాల్లో 5వేల మందికి గిరిజన రైతులకు పట్టాలు ఇచ్చారు.



- పేదల సొంతింటి కల నెరవేర్చారు. స్థలమిచ్చి గూడు నిర్మించిన మొట్టమొదటి సీఎం వైఎస్సారే. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా లక్షా 80వేల 817ఇళ్లు మంజూరు చేసి అందులో లక్షా 63వేల 140ఇళ్లను పూర్తిచేశారు. ఇందిరమ్మ పథకం కింద పేదలందరికీ కుల, మత, వర్గ, రాజకీయ భేదాలు లేకుండా ఇళ్లను అందించారు.



- నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతో 2007లో ప్రారంభించిన ఆరోగ్యశ్రీతో వేలాది మందికి జీవం పోశారు. 938రకాల వ్యాధులకు కార్పొరేట్ వైద్యం అందించారు. ప్రమాద బాధితులకు అత్యవసర సమయంలో ఆసుపత్రికి తరలిస్తే ప్రాణం నిలబెట్టవచ్చని 108అంబులెన్స్‌లను ప్రారంభించారు. గ్రామీణులకు ప్రతి నెలా వైద్యం అందించడానికి 104వాహనాలను అందుబాటులోకి తెచ్చారు.



- పేద విద్యార్థులు కూడా కార్పొరేట్ చదువులు అందించాలనే ఉద్దేశంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన వారిలో బీసీ విద్యార్థులే మన జిల్లాలో 72వేలకు పైగా ఉన్నారు.

- తొలిరోజు 78.91శాతం




శ్రీకాకుళం : దమ్మలవీధిలో తోట శివలక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ సంతోష్

జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ శుక్రవారం మొదలైంది. వలంటీర్లు తెల్లవారుజాము నుంచే లబ్ధిదారులకుపింఛన్లను పంపిణీ చేశారు. తొలిరోజు 78.91శాతం మందికి పింఛన్లను అందజేశారు. జిల్లా మొత్తం 3,17,002 పింఛన్లు ఉండగా 2,50,143 మందికి అందజేశారు.

ఉత్తమ గురువులు వీరే..

- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక



శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా శ్రీకాకుళం జిల్లా నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో డాక్టర్ గురుగుబెల్లి దామోదరరావు, గొల్లపల్లి లక్ష్మణరావు ఉన్నారు. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు వెలువరించారు. ఇందులో జి.దామోదరరావు లావే రు మండల పరిధిలోని ఇజ్జాడపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, జి.లక్ష్మణరావు వజ్రపుకొత్తూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోవిందపురంలో ఫిజికల్ సైన్స్(పీఎస్) స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగే వేడుకల్లో సీఎం జగన్ చేతులమీదుగా సత్కారాలు అందుకోనున్నారు. వీరిద్దరు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక కావడంపై జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఆర్.జయప్రకాష్, డీవైఈవోలు గార పగడాలమ్మ, ఎస్.తిరుమల చైతన్య తదితరులు సంతోషం వ్యక్తంచేశారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రయోగాల మాస్టారు..



వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు భౌతిక, రసాయన శాస్త్రాల్లో ప్రయోగాత్మక విద్యకు ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థులకు వచ్చిన ఆలోచనలకు కార్యరూపం ఇస్తున్నారు. ప్రయోగాలే ఆయన ఊపిరి. ఆయనను జిల్లాలో నడిచే ప్రయోగశాలగా పిలుస్తారు. తక్కువ ఖర్చుతో ప్రయోగాలు రూపొందించడంలో ఆయన దిట్ట. ఇందులో భాగంగా 101 ప్రయోగాలతో ప్రాక్టికల్ మేడ్ ఈజీ అనే పుస్తకాన్ని రచించి తక్కువ ఖర్చుతో ప్రయోగాలు తయారు చేయడం ఎలా అనే విషయాన్ని వివరించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాల్లో అత్యధికంగా పాల్గొన్న వ్యక్తిగా గొల్లపల్లి లక్ష్మణరావుకు పేరు ఉంది. అవార్డు బాధ్యత పెంచిందని ఆయన అన్నారు.

సేవల టీచర్



లావేరు: లావేరు మండలంలోని ఇజ్జాడపాలేం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ గురుగుబిల్లి దామోదరరావుది ఆమదాలవలస మండలంలోని తమ్మయ్యపేట గ్రామం. బాలల హక్కుల పరిరక్షణకు, బాల్య వివాహాలు నిర్మూలనకు కృషి చేయడం, చేయూత పేరుతో పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేయడం, ఉచితంగా మెడికల్ శిబిరాలు ఏర్పాటు చేయడం, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడం కోసం విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించడం వంటివి చేస్తుంటారు. 2020-22 సంవత్సరం వరకూ జిల్లా బాలల హక్కుల వేదిక జిల్లా కన్వీనర్‌గా పనిచేశారు. ఆ సేవలకు గుర్తుగా విశాఖపట్నంలోని ఓ కళాశాల వారు 2021లో డాక్టరేట్ పట్టాను ఇచ్చారు.

మేనల్లుడే హంతకుడు

- మేనమామను స్నేహితుడి సాయంతో హతమార్చిన మేనల్లుడు
- ఆర్థిక లావాదేవీలే కారణం
- వీడిన శ్రీకాకుళం మర్డర్ మిస్టరీ



హత్య వివరాలు వెల్లడిస్తున్న సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ గణేష్

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళంలో గత ఆదివారం జరిగిన ఇంటి సర్పింగరావు (నేతాజీ) హత్య కేసును పోలీసులు ఛేదించారు. నేతాజీ మేనల్లుడు నిమ్మకాయల కమల్ తన స్నేహితుడు ఏలూరి ప్రవీణ్ సాయి సాయంతో మేనమామను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితులను శుక్రవారం పొన్నాడ వంతెన ఇస్కాన్ టెంపుల్ సమీపంలో ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తమ సిబ్బందితో మాటు వేసి పట్టుకున్నారు. ఆస్తి తగాదాలు, ఆర్థిక లావాదేవీలే హత్యకు దారితీశాయని పోలీసుల విచారణలో నిందితులు ఒప్పుకున్నారు. కేసు విచారణాధికారి ఒకటో పట్టణ సీఐ ఎల్.సన్యాసినాయుడు, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బలివాడ గణేష్ తెలిపిన వివరాల్లోకి వెళ్తే..

వైజాగ్‌లో నివసిస్తున్న నిమ్మకాయల మంజుల భర్త అప్పారావు సీమ్యాన్‌గా చేస్తూ చనిపోవడంతో రూ. 25 లక్షల వరకు డబ్బులు వచ్చాయి. దీంతో మంజుల అన్న నేతాజీ ఫైనాన్స్ తిప్పుతానంటూ రూ.20 లక్షలు తీసుకున్నాడు. అయితే ఆ డబ్బును తిరిగి సోదరికి ఇవ్వలేకపోయాడు. దీంతో మంజుల కుమారులు నేతాజీని నిత్యం డబ్బులు అడిగేవారు.

తల్లి ఆరోగ్యం క్షీణించడంతో..

ఈ క్రమంలో మంజులకు క్యాన్సర్ సోకడమే కాక, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడటంతో ఆర్థిక అవసరాలు, ఇంటి అవసరాలకు చేస్తున్న అప్పులకు వడ్డీలు మరింత పెరిగాయి. తల్లి ఆరోగ్యం క్షీణించడంతో పెద్ద కుమారుడైన కమల్ మేనమామ నేతాజీపై ఒత్తిడి తేవడంతో పాటు ఒకసారి నగరంలోని మావూరివారివీధికి చెందిన స్నేహితుడు ప్రవీణ్‌సాయితో కలిసి గొడవ కూడా పడ్డాడు. దీనిపై కేసులూ అయ్యాయి.

అరెస్టు, రిమాండ్..

దీనిపై సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ ముద్దాయిలు నిమ్మకాయల కమల్, ఏలూరి ప్రవీణ్‌సాయిలిద్దరినీ శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, ఆర్థిక, ఆస్తి తగాదాలే ఈ హత్యకు దారితీశాయని పేర్కొన్నారు.

హత్య చేశారిలా..

గత నెల 26వ తేదీ శనివారం రాత్రి ముందుగా ప్రవీణ్ సాయి నేతాజీ ఇంటికి వచ్చి అతను లేకపోవడంతో వెళ్లిపోయాడు. మళ్లీ నేతాజీ వచ్చాక రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో కమల్‌తో కలిసి ప్రవీణ్‌సాయి వచ్చాడు. ఇంట్లో ఉన్న ప్రెషర్ కుక్కర్ సాయంతో కమల్ మామ నేతాజీ తలపై గట్టిగా కొట్టాడు. దీంతో మంచం మీద నేతాజీ పడటంతో అతని ఛాతీపై కమల్ కూర్చుని గట్టిగా పిడిగుద్దుల వర్షం కురిపించాడు. ప్రవీణ్ సాయి కాళ్లపై కూర్చొని దాడి చేశాడు. తర్వాత చేతులతో మెడపై గట్టిగా అదిమి ఊపిరిరాకుండా చేయడంతో నేతాజీ ప్రాణం వదిలాడు. ఆధారాలు దొరక్కుండా ఇంట్లో ఉన్న కారం అంతా చల్లి పారిపోయారు.

అర్ధరాత్రి వృక్ష విలాపం



తోటలో నరికివేసిన మామిడి చెట్టు



గెలలతో నేలకొరిగిన అరటితోట

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పండావారితోటలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఘాతుకానికి తెగబడ్డారు. కాశీబుగ్గ పట్టణానికి ఆనుకుని ఉన్న సువిశాలమైన తోటలో వివిధ రకాల జాతులకు చెందిన 220కు పైగా చెట్లను నరికేయడం సంచలనంగా మారింది. హరిముకుంద పండా అనే వ్యక్తి ఇక్కడ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మిస్తున్నారు. ఆ ఆలయం ఆవరణలోనే దుండగులు చెట్లను నరికేశారు. సపోటా తోటలో 40 చెట్లు, మామిడితోటలో 80 చెట్లు, గెలలతో ఉన్న 100కుపైగా అరటిచెట్లను నరికేశారు. శుక్రవారం ఉదయం తోటలో పని చేసే పనివారు గుర్తించడంతో విషయం బయటపడింది. తోటలో కట్ చేసిన చెట్ల విలువ సుమారు రూ.2లక్షలపైన ఉంటుందని యజమాని హరిముకుంద పండా తెలిపారు. ప్రతి సోమవారం అంధులకు, దివ్యాంగులకు పింఛన్లు అందించి వారికి భోజనంతో పాటు పండ్లను కూడా అందిస్తామని, ఇలా చెట్లను నరికేయడం ఏమిటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్పీ నాగేశ్వరరెడ్డికి జరిగిన ఘాతుకం వివరించానని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కౌలుకునే సాయం

- జిల్లాలో 2801 మంది కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా



లబ్ధిదారులైన రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కౌలు రైతులకు ప్రభుత్వం తోడ్పాటు అందించింది. అర్హులైన కౌలు రైతులకు 5వ సంవత్సరం చివరి విడత రైతు భరోసా, అలాగే రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం వెలగపూడి క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన 2801 మంది కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా కింద రూ.2.1 కోట్లు, అలాగే జిల్లాలో గార, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో అధిక వర్షాలు, గాలుల కారణంగా 78.36 ఎకరాల్లో అరటి పంట నష్టపోయిన 236 రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.19.59 లక్షలు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ప్రభుత్వం ఎల్లవేళలా రైతులకు అండగా ఉంటుందన్నారు. అర్హులు ఏ ఒక్కరూ మిగిలిపోకుండా ఈ-క్రాప్ ఆధారంగా పంట నష్టాలను అంచనా వేస్తూ గ్రామ సచివాలయాల్లో అర్హుల జాబితా ప్రదర్శించి, సీజన్‌లో జరిగిన పంట నష్టాన్ని సీజన్ ముగిసేలోగానే దాన్ని నేరుగా వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు పంట నష్టపరిహారం నమూనా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, జిల్లా అగ్రికల్చరల్ అడ్వైజరీ చైర్మన్ నేతాజీ, సభ్యులు గొండు రఘురాం తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా ప్రయోజనం పొందుతున్నాం



మాకు గోసాంలో 4 ఎకరాల మెట్టు భూమి ఉంది. నాలుగేళ్లుగా పంట నష్టపరిహారం అందుతోంది. ఏటా అరటి, బొప్పాయికి నష్టం వాటిల్లుతోంది. ఆపదలో పేద రైతులను ప్రభుత్వం ఆదుకుంటోంది.

– కంబుపు బంగారి, రైతు, గోసాం.

క్లుప్తంగా

వలంటీర్‌పై దాడి.. కేసు నమోదు

నందిగాం: నందిగాంలో 6వ క్లస్టర్ వలంటీర్‌గా సేవలు అందిస్తున్న గున్న విజయ్‌బాబుపై ప్రగడ ఆనందరావు అనే వ్యక్తి దాడి చేయడంతో అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితుడు తెలిపిన సమాచారం ప్రకారం.. విజయ్ శుక్రవారం తన క్లస్టర్‌లో పింఛన్లు పంపిణీ చేస్తుండగా ఆనందరావు భార్య వలంటీర్‌ను పిలిచి సిటిజన్ అవుట్ రీచ్ ఫొటోపై మాట్లాడారు. అంతలోనే ఆనందరావు తనపై దాడి చేశారని వలంటీర్ తెలిపారు. దాడిని అడ్డుకున్న గ్రామస్తులను కూడా కొట్టేందుకు వెళ్లాడని పేర్కొన్నారు. వలంటీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



గర్భిణికి పౌష్టికాహారం అందజేస్తున్న శాంతిశ్రీ

శ్రీకాకుళం అర్బన్: స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ జరిగేటట్లు చూడడమే తన ధ్యేయమని ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బగాది శాంతిశ్రీ అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఆమె శుక్రవారం శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టులోని రాధాకృష్ణ నగర్-2, హరిజన వీధి, మాపూరువీధి అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహార పంపిణీ చేశారు. టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్)ను సక్రమంగా అమలుచేసేందుకు జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ప్రీ-స్కూల్ పిల్లలతో సంభాషించారు.

దూరదర్శన్ బి గ్రేడ్ ఆర్టిస్టులుగా శ్రీకాకుళం కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళానికి చెందిన నాట్య గురువు మెహెర్ ప్రభాకర్ శిష్యులు సంధ్యశ్రీ ప్రతీక, అనూరాధ, వాసంతిలు ప్రతిష్టాత్మకమైన దూరదర్శన్ బి గ్రేడ్‌ను భరతనాట్య విభాగంలో సాధించారని మెహెర్ నృత్య కళానికేతన్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సంప్రదాయం గురుకులంలో కూచిపూడి విభాగంలో లీలాకృష్ణ, యామిని కాసిరెడ్డి, కె.బలరాం, లోకేశ్వరి, అంజలిలు కూడా బి గ్రేడ్ ఆర్టిస్టులుగా ఎంపికైనట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. వీరిలో బలరాం, అంజలిలు గిరిజన తెగకు చెందిన వారని తెలిపారు.

కళాసేవలో కచ్చపి సంస్థ



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: కచ్చపి కళాక్షేత్రం సంస్థ నిత్యం కళాసేవలో తరిస్తోందని పలువురు వక్తలు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో కచ్చపి కళాక్షేత్రం 10వ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం శాస్త్రీయ సంగీత పోటీలను జూనియర్ విభాగంలో నిర్వహించారు. సాయంత్రం జరిగిన గాత్ర సంగీత కచేరిలో విజయవాడకు చెందిన ఆలిండియా ఎ గ్రేడ్ ఆర్టిస్టు మోదుమూడి సుధాకర్ కచేరి జరిగింది. వీరికి విజయనగరానికి చెందిన మహాదాసు నీలాద్రి వయులీనంపైన, బంకుపల్లి దుర్గా శ్రీనివాస శర్మ మృదంగంపై, తెనాలికి చెందిన వి.రామకృష్ణ ఘటంపై వాద్య సహకారం అందించారు. ముందుగా కళాకారులను అతిథులు సత్కరించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	60,380-00
బంగారం(22క్యా. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

ఉద్దానం పెద్దబిడ్డ



- జిల్లాలో 32,565 ఎకరాల్లో కొబ్బరి సాగు
- తలసరి ఆదాయ అభివృద్ధిలో కొబ్బరిదే కీలక పాత్ర
- నేడు కొబ్బరి దినోత్సవం



పచ్చనిచెట్లతో కళకళలాడుతున్న ఉద్దానం కొబ్బరితోటలు (ఇన్‌సెట్లో) డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో అగ్రికల్చర్‌ అసిస్టెంట్లు

కవిటి: అడుగడుగునా కొబ్బరి చెట్లు. అంతదూరంలో సముద్రం. మధ్యలో చిన్న చిన్న నీటి పాయలు. ఆ అందాల నడుమ పచ్చని పల్లెలు. ఈ భూస్వరూపానికి ముద్దుపేరు ఉద్దానం. ఆ ఉద్దానం పెద్ద బిడ్డ కొబ్బరి. ఇంటికి వారసుడు ఉన్నా లేకపోయినా, చూసుకున్నా చూసుకోకపోయినా నాలుగు కొబ్బరి చెట్లు ఉంటే పెద్ద కొడుకులు ఉన్నట్టే లెక్క. అంతగా ఇవి ఉద్దానం బతుకుల్లో మమేకమైపోయాయి. తిత్లీ, హుద్‌హుద్ వంటి ప్రకృతి వైపరీత్యాలకు ఈ చెట్ల తలలు తెగినపుడు ఉద్దానం వాసి కేవలం పంట నష్టపోయినట్లు బాధ పడలేదు. కుటుంబ సభ్యులను కోల్పోయినట్లు శోకం పెట్టుకున్నారు. నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం.

రాష్ట్రంలో రెండో కోనసీమగా గుర్తింపు పొందిన కొబ్బరి పంట జిల్లా తలసరి ఆదాయం వృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. జిల్లాలో 32,565 ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. గతంలో అధికారుల గణాంకాలను పరిశీలిస్తే ఒక చెట్టు ఏడాదికి 120 నుంచి 150 కాయలు గరిష్టంగా దిగుబడి ఇచ్చేది. అంటే రెండు నెలలకు ఓ చెట్టు సగటున 25 కాయలు కాస్తే మంచి ఫలసాయం. కానీ ప్రస్తుతం ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల నేపథ్యంలో ఈ సగటు విలువ ఒక చెట్టు 15 కాయలకు మించడం లేదు. ఈ నేపథ్యంలో ఇదే పంటను నమ్ముకుని జిల్లాలో ప్రత్యక్షంగా పరోక్షంగా 3.50 లక్షల మంది రైతులు, రైతు కూలీలు జీవనం సాగిస్తున్నారు. కొబ్బరి రైతుల కారణంగా సరైన ఆదాయం వీరికి గ్రామాల్లోనే కూలి రూపంలో లభిస్తోంది. ఇదే క్రమంలో పరిశీలిస్తే కొంతమంది వ్యవసాయంపై మక్కువ కలిగిన అభ్యుదయ రైతులు తమ పిల్లల్ని వ్యవసాయ, ఉద్యాన శాఖలకు సంబంధించిన అగ్రి, హార్టికల్చర్, డిప్లమో, ఇంజనీరింగ్ కోర్సుల్లో చేర్పి ఉన్న ఊరిలోనే ఉద్యోగాల్ని పొందుతుండడం విశేషం.

మెడిసిన్ ర్యాంక్ వచ్చినప్పటికీ..



ముత్యాలపేటకు చెందిన ఆరింగి శివాజీ, శైలజది వ్యవసాయ కుటుంబం. వీరి కుమార్తె ఆరంగి అంకితకు ఎంసెట్ ఎంట్రన్స్‌లో మంచి ర్యాంక్ వచ్చినప్పటికీ మెడిసిన్‌లో చేరకుండా పార్వతీపురం మన్యం జిల్లాలోని హార్టికల్చర్ యూనివర్సిటీలో హార్టికల్చర్ గ్రాడ్యుయేషన్ చదువుకునేందుకు నిర్ణయించుకుంది. తమ ప్రాంతంలో రైతులకు తన వంతుగా సేవచేయాలన్న లక్ష్యంతో చదువుతున్నట్టు తెలిపింది. పీజీ చేసి పీహెచ్‌డీ కూడా హార్టికల్చర్ విభాగంలో చేయాలన్నది తన లక్ష్యంగా చెప్పింది.

మా నాన్న వల్లే



మా నాన్న ముప్పై ఏళ్ల కిందటే ఆధునిక వ్యవసాయం ప్రారంభించారు. నేను ఆయన బాటలోనే వెళ్తున్నాను. నా కొడుకు పినింటి కల్యాణ్ చిన్నతనం నుంచే అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌పై ఆసక్తిని పెంచుకున్నాడు. దీంతో తన నిర్ణయం ప్రకారం బాపట్లలో డిగ్రీ తర్వాత జర్మనీలో పీజీ పూర్తి చేశాడు. అక్కడే ప్రస్తుతం సీడ్ టెక్నాలజీ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నాడు.

– పినింటి జయరావు, అభ్యుదయ రైతు, కవిటి కొత్తూరు.

నాన్న ఆశయాన్ని సాధించడమే లక్ష్యంగా



మాది పూర్తిగా సన్నకారు రైతు కుటుంబం. మా నాన్నకు ఉన్న మూడు ఎకరాల కొబ్బరి తోటలో వచ్చిన ఆదాయంతోనే మా కుటుంబపోషణ, చదువులు సాగించాం. మానాన్న బెందాళం సన్యాసిరావుకు మా చిన్నతనం నుంచే మేము వ్యవసాయ శాఖలో పెద్ద ఉద్యోగులుగా తయారు చేయాలన్న లక్ష్యం ఉండేది. బ్యాంకు రుణం తీసుకుని నన్ను జర్మనీలో అగ్రి ఎమ్మెస్సీ చదివించారు. దురదృష్టవశాత్తూ నాన్న ఇటీవలే చనిపోయారు. స్విట్జర్లాండ్‌లో ప్రపంచస్థాయిలో ఏడో ర్యాంక్ కలిగిన యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసేందుకు నాకు అవకాశం దొరకడం మానాన్న ఆశీస్సులే.

– బెందాళం ప్రశాంత్, అగ్రికల్చర్ పీజీ స్టూడెంట్, జర్మనీ

అపురూప అలంకరణ

శ్రావణ శుక్రవారం పూట అమ్మవార్లను అపురూపంగా అలంకరించారు. మహిళలు వరలక్ష్మి వ్రతాలు ఆచరించి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అలాగే లలితా సహస్ర నామ పారాయణాలు నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్



శ్రీకాకుళం బాకర్ సాహెబ్ పేటలోని దుర్గామహాలక్ష్మి



శ్రీకాకుళం కోటేశ్వరాలయంలో రాజరాజేశ్వరి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు

'ప్రధాన మంత్రి విశ్వకర్మపై అవగాహన పెంచుకోండి'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వివిధ వృత్తుల సంఘాలకు ప్రధాన మంత్రి విశ్వకర్మపై అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. ఆయన శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి విశ్వకర్మపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్హత గల వారు ఆన్‌లైన్ చేసుకునేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు రుణాలు వస్తాయన్నారు. రిజిస్ట్రేషన్లు ఎక్కువ చేస్తే నిధులు ఎక్కువగా వస్తాయని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, సీఎస్సీలు ప్రజలకు అవగాహన కల్పించాలని, అవకాశం ఉన్నవరకు ఎక్కువ మంది రిజిస్ట్రేషన్ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులు ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రిజిస్ట్రేషన్ తర్వాత శిక్షణకు సంబంధిత శాఖల చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఐడీ కార్డు, సర్టిఫికెట్ ద్వారా గుర్తింపు ఇస్తారని, వ్యాపారాభివృద్ధికి రుణాలు కూడా అందిస్తారని వివరించారు.

పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ రిజిస్ట్రేషన్‌కు కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులన్నారు. 18 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు కలిగి, వారి పూర్వీకుల నుంచి కుటుంబ వృత్తిగా చేస్తున్న హస్తకళాకారులు ప్రధానమంత్రి విశ్వకర్మ కింద నమోదు చేసుకోవడానికి అర్హులని వివరించారు. లబ్ధిదారుడు కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వం క్రెడిట్ ఆధారిత పథకాల కింద రుణాలు పొంది ఉండకూడదని (రుణాన్ని తిరిగి చెల్లించిన వారు ప్రధాన మంత్రి విశ్వకర్ కింద అర్హులు) పేర్కొన్నారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే వారు ఈ పథకానికి అర్హులు కారని, రూ.500 ఇన్సెంటివ్స్‌తో ఐదు రోజులు, 15 రోజుల శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్య కిరణ్, పరిశ్రమల శాఖ ఏడీలు రమణారావు, రఘునాథ్, డీఎల్‌టీఓ వాసుదేవరరావు, కిరణ్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు. వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టే వారు, తాపీ పని చేసేవారు, బుట్ట, చాప, చీపుర్లు నేసేవారు, బొమ్మల తయారీ దారులు, బొమ్మలు తయారీ దారులు సంప్రదాయ, క్షురకులు, రజకులు, దర్జీలు, చేపల వల తయారీ దారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

దేహదారుఢ్యం కీలకం: ఎస్పీ



పోలీసు పరేడ్ పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసులు దేహ దారుఢ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు శుక్రవారం ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఆమె పరేడ్‌ను పరిశీలించారు. పోలీసులు నిరంతరం సాధన చేయాలని, దేహ దారుఢ్యం కోసం శారీరక శ్రమ తప్పనిసరని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. దీనికోసమే గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విఠలేశ్వర్, తిప్పేస్వామి, డీఎస్పీలు వై.శృతి, వాసు దేవ్, ప్రసాదరావు పాల్గొన్నారు.

'కార్మికులపై నిందలు వేస్తారా..?'

కాశీబుగ్గ: జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులను చిన్న చూపు చూడడం తగదని కాష్యూ లేబర్, రైస్ మిల్లర్స్ లేబర్ అసోసియేషన్ కార్యవర్గం పేర్కొంది. లేబరు యూనియన్ కార్యాలయంలో శుక్రవారం వెయ్యి మంది కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి ఆవేదనను వ్యక్తం చేశారు. పాట్నూరు బాలరాజు అనే జీడి వ్యాపారి అతని పరిశ్రమలో పనిచేస్తున్న పదిహేను మంది మహిళలకు దొంగలని నింద వేశారని, ఎలాంటి ఆధారం లేకుండా తప్పుడు నిందలు వేయడం సరికాదని అన్నారు. యజమానులు, కార్మికులు సంయుక్త సమావేశంలో చర్చిస్తుండగా యజమాని ఆ మహిళను చూపుతూ దొంగ దొంగ అని చేతులు తగిలించడంతో ఆమె అతడిని నెట్టిందని అన్నారు. యజమానులు చర్చలు చేయకుండా కార్మికులకు పీసీఎంఏ హాల్‌లో పెట్టి తాళం వేయడం ఏమిటని అన్నారు. కార్మికుల దొంగతనం చేసి ఉంటే నిజ నిర్ధారణ చేయాలన్నారు. కార్మికుల సంఘం ఏర్పడి నలభై ఏళ్లు పూర్తయిందని, యజమానుల సంఘం పెట్టి యాభై ఏళ్లు దాటిందని ఇంతవరకు ఇలాంటి సంఘటనలు లేవని అన్నారు. కార్మికుల పొట్ట కొట్టడానికి ఏ చిన్న కారణం దొరికినా యజమానులు వాడుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, కార్యదర్శి బొమ్మాళి తాతయ్య, అధ్యక్షుడు బోనెల భీమారావు, కోశాధికారి తామాడ రాము, పూర్వ అధ్యక్షులు బొంపల్లి సింహాచలం తదితర కార్మికులు పాల్గొన్నారు.

కుప్పిలి, కర్నేనలకు జాతీయ స్థాయి సాహిత్య పురస్కారాలు

ఆమదాలవలస: ఆమదాలవలసకు చెందిన కుప్పిలి వెంకటరాజారావు, కర్నేన జనార్దనరావులు జాతీయ స్థాయి సాహిత్య పురస్కారాలకు ఎంపికైనట్లు శుక్రవారం వారు తెలిపారు. కరీంనగర్‌కు చెందిన ఆర్యాణి సకల కళా వేదిక, గౌతమేశ్వర సాహితీ కళా సంస్థలు సంయుక్తంగా గత నెల 27న 'ఒక గంటలో రెండు కవితలు' పోటీ నిర్వహించారని, ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 50 మంది కవులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఆమదాలవలసకు చెందిన కవులు కె.వి.రాజారావు, కె.జనార్దనరావులు ప్రతిభను ప్రదర్శించారు. వీరికి 10న కరీంనగర్, ఫిల్మ్ నగర్ వేదికపై పురస్కారం అందించనున్నారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



ఎం.నీలేష్



ఎం.పురంధరి



టి.జవహర్‌రాజ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో మేడపల్లి నీలేష్, మేడపల్లి పురంధరి, తంగుడు జవహర్‌రాజ్, బోణి అశ్వద్ ఉన్నారు. పూణేలోని శివ ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు 3వ జాతీయస్థాయి అండర్ వాటర్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్-2023 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల కోసం వీరు శుక్రవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు హారికాప్రసాద్, డీఎస్ఏ చీఫ్ కోచ్ కె.శ్రీధర్‌రావు, అంతర్జాతీయ వెటరన్ స్విమ్మర్ ఎస్.కాంతారావు, కోచ్ మురళీధర్, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోరుకు సిద్ధం



వెయిట్‌లిఫ్టింగ్ సాధనలో క్రీడాకారుడి ప్రతిభను పరిశీలిస్తున్న కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి జూనియర్స్, సబ్‌జూనియర్స్, సీనియర్స్, పురుషులు, మహిళల వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నారు. ఇందులో రాణించిన క్రీడాకారులను గుర్తించి, ఎంపిక చేసిన వారిని రాష్ట్రపోటీలకు తీర్చిదిద్దనున్నారు. జిల్లాస్థాయి 37వ పురుషులు, 22వ మహిళల వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలతోపాటు ఎంపికలను కూడా ఈనెల 3వ తేదీన నిర్వహించనున్నారు. ఈ పోటీలు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా జరగనున్నాయి. పోటీలను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జిల్లా ఎస్పీ జీఆర్ రాధికతోపాటు రాష్ట్ర, జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ పెద్దలు హాజరుకానున్నారు. పోటీలను విజయవంతం చేయాలని శ్రీకాకుళం జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి కొత్తకోట శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఆసక్తి, అర్హత కలిగి ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డ్, రెండు పాస్ ఫొటోలతో ఎంపికలకు హాజరుకావాలని సూచించారు. క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకోవాలని, ఎంపికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- రాఖీ కట్టించుకుని తిరిగి వస్తుండగా మృతి





ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై లారీ ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందిన గోవిందరావు (ఇన్‌సెట్లో) గోవిందరావు (ఫైల్)

గోపాలపట్నం : 'రక్షాబంధన్ మా బంధాన్ని తెంచేస్తుందని ఊహించలేదు. రాఖీ కట్టేందుకు రాకపోయి ఉంటే నా అన్న బతికేవాడు' అని ఆ చెల్లెలు ఆవేదన అందర్నీ కలచివేసింది. గురువారం రాత్రి ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌పై ట్రాలర్ ఢీకొట్టిన ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు చెందిన కొంచాడ గోవిందరావు (27) (అలియాస్ గోపి) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా అగనంపూడిలో నివాసముంటున్న చెల్లి పద్మ ఇంటికి సాయంత్రం ద్విచక్రవాహనంపై గోవిందరావు వెళ్లాడు. రాఖీ కట్టించుకుని, చెల్లిని ఆశీర్వదించి తిరుగుపయనమయ్యాడు. ఎన్ఏడీ ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి స్టీల్‌ప్లాంట్ నుంచి ఐరన్ లోడుతో వెళుతున్న ట్రాలర్ మురళీ నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. వెనుక చక్రాల కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు.

రెండు నెలల కిందటే విశాఖకు..

నిమ్మాడ నుంచి రెండు నెలల క్రితమే మురళీ విశాఖ వచ్చాడు. నగరంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్‌లో కారు డ్రైవర్‌గా చేరాడు. మురళీనగర్‌లో తన స్నేహితుడు ఇంట్లో ఉంటున్నాడు. మృతునికి తల్లి, తండ్రి, సోదరి ఉన్నారు. తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఒకే ఈతలో మూడు దూడలు



ఒకే ఈతలో జన్మించిన దూడలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని జాడుపేట గ్రామానికి చెందిన గోక జగ్గారావు పెంచుకుంటున్న పాడి ఆవు ఒకే ఈతలో మూడు దూడలకు జన్మనిచ్చింది. ఆవు ఒక కాన్పులో ఒకటి, రెండు దూడలకు జన్మనిస్తుందని మూడు దూడలకు జన్మనివ్వటం అరుదుగా జరుగుతుందని రైతు తెలిపారు. ఆవు దూడలు ఆరోగ్యకరంగా ఉన్నాయని రైతు జగ్గారావు తెలిపారు. పశువైద్యాధికారి జి.కవిత దూడల ఆరోగ్యాన్ని పరీక్షించి రైతుకు తగిన సూచనలు చేశామన్నారు.

'పాత పింఛన్ విధానమే కావాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో పాత పింఛన్ విధానం మాత్రమే కావాలని, ఇతర విధానాలు రద్దుచేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్లా దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షుడు గురుగుబెల్లి భాస్కరరావు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ రద్దుపై ఏళ్లుగా పోరాడుతున్నామని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి, పాత పింఛను విధానం తీసుకు రాకపోతే ఉద్యోగ ఉపాధ్యాయ లోకం పోరుబాట పట్టక తప్పదన్నారు.